రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం!

- పడకల్–మనోహరబాద్ వరకు పెద్ద పెద్ద గుంతలు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మారిన తొర్లికొండ రోడ్డు





గుంతలు పడిన మనోహరాబాద్ రోడ్డు



జక్రాన్‌పల్లి : మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో రాకపోకలకు కష్టంగా మారుతోంది. రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్ నుంచి వయా మనోహరాబాద్ మీదుగా తొర్లికొండ వరకు వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పడకల్ నుంచి మనోహరాబాద్ వరకు మూడు కిలోమీటర్ల రోడ్డుపై ముప్పై గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మొత్తం కంకర తేలి పెద్ద పెద్ద గుంతలు పడడంతో ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. మనోహరాబాద్ గ్రామస్తులు నిజామాబాద్, హైదరాబాద్ పట్టణ ప్రాంతాలకు వెళ్లడానికి ఈ రోడ్డును ఎక్కువగా ఆశ్రయిస్తారు. అంతేకాక వ్యవసాయ గోదాంలోని ఎరువులు కోసం రైతులు, ఇతర వ్యాపార అవసరాల నిమిత్తం మనోహరాబాద్ గ్రామస్తులు ప్రతి నిత్యం పడకల్ గ్రామానికి వెళ్తుంటారు. మనోహరాబాద్ నుంచి తొర్లికొండ వరకు ఉన్న రోడ్డు సైతం పాడైపోయింది. తొర్లికొండ గ్రామస్తులు వివిధ పనుల నిమిత్తం జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి ఈ రోడ్డు గుండానే ప్రయాణం చేస్తుంటారు. ఈ రోడ్డు బాగా లేకపోవడంతో తొర్లికొండ గ్రామస్తులు ఆర్మూర్‌కు వెళ్లి జక్రాన్‌పల్లికి తిరిగి వస్తున్నారు. దీంతో దూరం ఎక్కువ అవుతోంది. అంతేకాక ఈ రోడ్డులో మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కూలిపోయింది. దీంతో భారీ వాహనాలు రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెద్దమ్మ ఆలయం నుంచి తొర్లికొండ వరకు ఉన్న రోడ్డు నరకాన్ని తలపిస్తోంది. ఏడు కిలోమీటర్ల రోడ్డు అతుకుల బొంతలా మారింది. ఈ రోడ్డును గూర్చి పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నరకాన్ని తలపిస్తోంది



మనోహరాబాద్ నుంచి పడకల్ వరకు ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రయాణం చేయలేకపోతున్నాం. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి. – మల్లాగౌడ్, మనోహరాబాద్


నిధులు మంజూరు చేయాలి



పడకల్ నుంచి తొర్లికొండ వరకు ఏడు కిలోమీటర్ల రోడ్డులో ఎక్కువగా గుంతలే కనిపిస్తున్నాయి. మూడేళ్లుగా ఈ రోడ్డు గుండా వెంట వెళ్లాలంటేనే భయం వేస్తోంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలి. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– రామాగౌడ్, మనోహరాబాద్

యువవికాసం.. 9,439 దరఖాస్తులు



- ఈనెల 14తో పూర్తయిన గడువు
- గడువు పెంచాలంటున్న యువత

నిజామాబాద్ సిటీ : రాజీవ్ యువ వికాసం పథకానికి బల్దియా పరిధిలో ఇప్పటివరకు 9,439 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు బల్దియా అధికారులు తెలిపారు. ఈ పథకానికి ఈనెల 14 చివరి తేదీగా ప్రభుత్వం గడువు విధించింది. దీంతో దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఫారమ్‌తోపాటు మున్సిపల్ కార్యాలయంలో కూడా నిజామాబాద్ నార్త్, సౌత్‌తోపాటు విలీన గ్రామాలకు చెందిన యువత ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను నేరుగా మున్సిపల్ కార్పొరేషన్‌లోని కౌంటర్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 9,439 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎస్సీ కార్పొరేషన్‌లో 1374 మంది, బీసీ కార్పొరేషన్‌లో 1,579, ఎస్టీ కార్పొరేషన్‌లో 186 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా ముస్లిం మైనారిటీ కార్పొరేషన్‌కు మాత్రం అత్యధికంగా 5,629 మంది దరఖాస్తు చేసుకున్నారు. క్రిస్టియన్ మైనారిటీకి కేవలం 51 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈబీసీ కింద 36 మంది, వికలాంగులు, ఇతర కేటగిరిలకు చెందిన వారి నుంచి 584 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



రిలయన్స్ మాల్‌లో అవగాహన కల్పిస్తున్న నర్సింగ్‌రావు

ఖలీల్‌వాడి : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, రిలయన్స్ మార్ట్‌లలో అగ్ని ప్రమాదాలపై ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు మంగళవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలు వ్యాప్తి చెందకుండా ఉండే చిట్కాలు, మంటలు ఆర్పివేయడానికి అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఇందల్వాయిలో..

ఇందల్వాయి : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఇందల్వాయి బస్టాండ్‌లో అగ్ని ప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై గన్నారం అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. డివిజన్ ఫైర్ ఆఫీసర్ విక్రమ్, ఫైర్‌మన్‌లు వేణు, రవి, ఆర్టీసీ కంట్రోలర్ చారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన నూతన కార్యవర్గం



ఖలీల్‌వాడి: నూతనంగా ఎన్నికైన బార్‌అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా జడ్జి సునీతా కుంచాలను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. న్యాయవాదుల సమస్యలను జడ్జికి వివరించారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



ఖలీల్‌వాడి : అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని రైల్వేపోలీస్ స్టేషన్‌లో ఎస్సై సాయిరెడ్డి, ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఒకటో టౌన్ ఎస్సై మొగిలయ్య, ఏఎస్సై హమీద్ ఖాన్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జెల్ల మురళి సంస్మరణ సభ

నిజామాబాద్ సిటీ: కార్మికుల హక్కుల కోసం పోరాడిన కార్మిక నాయకుడు జెల్ల మురళి సంస్మరణ సభను ఈనెల 17న నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ద్వారకానగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుడు మోహన్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం, నాగారం, శ్రామిక్‌నగర్‌లలో ఇంటి స్థలాల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. సమావేశంలో నాయకులు శివకుమార్, రఘు, పవన్, రాజు, శంకర్, మల్లేశ్, అంజయ్య, వీరయ్య పాల్గొన్నారు.

పడకంటి రాముకు సన్మానం

నిజామాబాద్‌నాగారం: సోషల్ వర్క్ సేవలో ఇటీవల డాక్టరేట్ పొందిన జిల్లా కేంద్రానికి చెందిన పడకంటి రామును విశ్వబ్రాహ్మణ సంఘం(దుబ్బ) నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్ చారి, శ్రీరామ సతీశ్ కుమార్ చారి, కత్రాజి సుమన్, సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణకు పారాయణం

నిజామాబాద్ రూరల్: హిందూ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడానికి ప్రతి మంగళవారం ఇంటింటా పారాయణం చేస్తున్నట్లు బ్రాహ్మణ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్ తెలిపారు. నగరంలోని సీతారాంనగర్ కాలనీలో కులకర్ణి గృహంలో హనుమాన్ చాలీసా పంచసూక్త రామ స్తోత్రములను పఠించారు. కార్యక్రమంలో మచ్చ వెంకటేశం, మారుతీ జోషి, న్యాలం శ్రీను, దత్తు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు

క్రీడాకారుడికి సీపీ అభినందన



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రానికి చెందిన ఎండీ తాజ్‌ముల్ హైమద్ జాతీయ ఊషూ క్రీడలో బ్రాంజ్ మెడల్ సాధించడంతో సీపీ పోతరాజు సాయిచైతన్య అతనిని తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. జాతీయస్థాయిలో తెలంగాణ పేరుని నిలబెట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనండి సారూ..



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జక్రాన్‌పల్లి: పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ మంగళవారం మాదాపూర్ రైతులు డిప్యూటీ తహసీల్దార్ దత్తాద్రికి వినతి పత్రం అందజేశారు. ఇరవై రోజులుగా ధాన్యాన్ని కల్లాల వద్ద ఆరబెట్టామని కానీ ఇంత వరకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదన్నారు. సకాలంలో ధాన్యాన్ని కొనకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోయారు. ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికి ఇప్పటికి ఒక్క గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయలేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు కోరారు.

అన్సాన్‌పల్లిలో పోషణపక్షం ఉత్సవాలు



ఇందల్వాయి:అన్సాన్‌పల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మహిళలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలు, పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ, ఎంఆర్‌వో వెంకట్ రావు, ఎంపీడీవో అనంత్ రావు, హెచ్‌ఈవో శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, సంతోష్ రెడ్డి, అంగన్‌వాడీ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వివక్ష లేని విద్యా విధానానికి పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సరిత

నిజామాబాద్ అర్బన్: వివక్ష లేని విద్యా విధానానికి ప్రతి ఒక్కరూ పోరాడాలని తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సరిత పిట్ల అన్నారు. జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించారు. సభకు సరిత హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో నగరంలోని చాలా చోట్ల పేదల ఇళ్లను గూండాలు కబ్జా చేయాలని చూస్తే వారిని తరిమికొట్టిన గొప్ప వ్యక్తి జార్జిరెడ్డి అని కొనియాడారు. చదువులో కూడా న్యూక్లియర్ ఫిజిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారని అన్నారు. ప్రతి విద్యార్థి భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, జార్జిరెడ్డి, అంబేడ్కర్, సావిత్రిబాయి పూలే వంటి ఎంతో మంది మేధావులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జి రమేశ్, సాయిబాబా, ఆర్ గౌతమ్ కుమార్, జన్నారపు రాజేశ్వర్, ప్రిన్స్, నిఖిల్, హుస్సేన్, రాహుల్, సాయికిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కూలీలు

సిరికొండ : సస్పెండైన ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. గడ్కోల్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు మంగళవారం మండల పరిషత్ కార్యాలయానికి తరలివచ్చారు. కూలీలకు డబ్బులను ఇప్పించకుండా విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ స్వామిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని తెలిపారు. అతడిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని కూలీలు దుయ్యబట్టారు. అతడిని విధుల్లోకి తీసుకోవద్దని కూలీలు ఎంపీడీవో మనోహర్ రెడ్డికి వినతి పత్రం అందచేశారు. కూలీలకు రైతు కూలీ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఏఐకెఎంఎస్ నాయకులు బాలయ్య, భూమేశ్, చిన్న గంగాధర్, కూలీలు లింబ్యా, వెంకన్న, బీక్యా, రాములు, యమున, జ్యోతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు రెమ్యునరేషన్ చెల్లించండి



నిజామాబాద్ అర్బన్ : సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ చెల్లించాలని కోరుతూ డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలయ్య, ఓమాజీ మంగళవారం కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రశాంత్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వే పూర్తి నెలలు గడుస్తున్నా రెమ్యునరేషన్ చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో టీడీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి

సిరికొండ: కిశోర బాలికలు ఆకుకూరలు, పప్పులు లాంటి పోషకాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి అరవింద్ సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షంలో భాగంగా కిశోర బాలికలకు అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. బాలికలకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి, రక్తహీనత, అనీమియా, పోషకాహారం, వ్యక్తగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, సవిత, అరుణకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు మండోదరి, ఏఎన్‌ఎం స్వరూప, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా విడుదల చేయాలి



సిరికొండ: భూమి లేని వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన ఆత్మీయ భరోసా నిధులను విడుదల చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. గడ్కోల్‌లో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆత్మీయ భరోసా విడుదల చేయకపోతే సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కిషన్, ఉపాధ్యక్షులుగా కిశోర్, అశోక్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, సహాయ కార్యదర్శులుగా సాయారెడ్డి, అంబన్న తదితరులు ఎన్నికయ్యారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



జక్రాన్‌పల్లి: మండలంలోని కొలిప్యాక్‌లో ఎనిమిది మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. సొసైటీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మద్దుల రమేశ్, నాయకులు సాగర్, రవిగౌడ్, శంకర్, సాయిగౌడ్, ప్రేమ్ కుమార్, అమృత్, తిరుపతి, నారాయణ, మద్దుల శ్రీనివాస్, మోహన్, తిరుపతి, దినేశ్, లింబాద్రి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నవాల్గోట్‌లో..

సిరికొండ: మండలంలోని చిన్నవాల్గోట్‌లో ముగ్గురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బడాల మహిపాల్, లింబాద్రి, ప్రవీణ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

నడిపల్లి కార్యదర్శిగా రాధిక

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి మేజర్ జీపీ ప్రత్యేకాధికారి, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా కె రాధిక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పంచాయతీ సిబ్బందితో సమీక్షించారు. ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ సిబ్బంది సహకారంతో గ్రామంలో నెలకొనే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాధిక తెలిపారు.

రేపు పెన్షనర్స్ సీనియర్ సిటిజన్స్ భవనం ప్రారంభం



నిజామాబాద్ నాగారం: తెలంగాణ ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నిర్మించిన పెన్షనర్స్–సీనియర్ సిటిజన్ భవనాన్ని ఈ 17న ప్రారంభించనున్నట్లు జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ రావు మంగళవారం తెలిపారు. కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మదన్‌మోహన్, శిరప హనుమాన్లు, హమీదుద్దీన్, ఈవీఎల్ నారాయణ, నరేందర్, అశోక్, సిరప్ప లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయితీ టార్పాలిన్ల పంపిణీ



సిరికొండ: మండల కేంద్రంలో రైతులకు రాయితీపై టార్పాలిన్లను బీజేపీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీ అర్వింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ సహకారంతో రైతుల అవసరాల కోసం పార్టీ నాయకులు టార్పాలిన్లను అందించారు. పార్టీ నాయకులు అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, ధర్పల్లి బాబురావు, సూరిసీడ గోపి, కామాని కిరణ్, బచ్చు మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా పదోన్నతి



సిరికొండ: సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రవీందర్ ఎస్సైగా పదోన్నతి పొందారు. బోధన్‌కు చెందిన రవీందర్ ఆరు నెలల క్రితం సిరికొండకు బదిలీపై రాగా పదోన్నతి పొందడంతో ఎస్సైగా ఆదిలాబాద్ జిల్లాలో పోస్టింగ్ పొందారు. పదోన్నతి పొందిన రవీందర్‌ను పీఎస్‌లో సీఐ భిక్షపతి, ఎస్సై ఎల్ రామ్ సన్మానించారు.

తాడెంలో ఉచిత వైద్యశిబిరం

మోపాల్: మండలంలోని తాడెం గ్రామంలో గురు రాఘవేంద్ర సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు బీపీ, షుగర్, ఇతరత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి జెమ్స్, శ్రీనివాస్, జ్యోతి, నందిని, దీపిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని అందించడమే లక్ష్యం



నిజామాబాద్ రూరల్: విద్యార్థులకు విజ్ఞానం, విజ్ఞత అందించడమే శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయం(కంచి వర్సిటీ) లక్ష్యమని వీసీ గొల్లపల్లి శ్రీనివాస్, డీన్ వెంకటరమణ పేర్కొన్నారు. నగరంలోని ఉత్తమ తిరుపతి క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తమ కంచి వర్సిటీలో అనేక కోర్సులు అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా వర్సిటీలో స్పాట్ కౌన్సెలింగ్ ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు www.kanchiuniv.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, మరిన్న వివరాలకు 9655085217, 7708557707 నంబర్లను సంప్రదించాలని సూచించారు. అనంతరం యూనివర్సిటీకి సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంపత్, మధుసూదన్ జోషి, ఫణి చక్రవర్తి, విష్ణు ప్రసాద్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందికి అందని వేతనం

నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కొందరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు అందలేదు. బల్దియా కార్యాలయంలో 1300 మంది వరకు పలు విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతాయి. అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి ప్రతీ నెల 5 నుంచి 8వ తేదీవరకు వేతనాలు అందుతాయి. కానీ ఏప్రిల్‌లో మాత్రం 15 గడిచినా వేతనాలు అందలేదు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే 300 మందికి వేతనాలు రాలేదు. దీంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకుని వేతనాలు అందేలా చూడాలని సిబ్బంది కోరుతున్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
- స్క్రీన్-1 జాక్(తెలుగు)-10.45, 1.30, 4.20, 7.20, 10.20
- స్క్రీన్-2 గుడ్ బ్యాడ్ అగ్లీ(తెలుగు)-1.40, 10.20
- ఫలక్‌నుమా దాస్(తెలుగు)-4.30
- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి(తెలుగు)-7.30
- స్క్రీన్-3 జాట్(హిందీ)-11.00, 1.40, 7.30
- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి -4.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1 గుడ్ బ్యాడ్ అగ్లీ(తెలుగు)-10.40, 1.35, 7.15, 10.10
- మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-4.30
- స్క్రీన్-2 జాక్(తెలుగు)-10.20, 1.15, 4.10, 7.05, 10.00
- స్క్రీన్-3 జాట్(తెలుగు)-10.00, 1.10, 4.20, 7.30, 10.40
- స్క్రీన్-4 అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి -10.05, 1.10, 4.15, 10.25
- ఫలక్‌నుమా దాస్(తెలుగు)-7.15

లలితామహల్ జాక్ (తెలుగు)

దేవి గుడ్ బ్యాడ్ అగ్లీ (తెలుగు)

నటరాజ్ జాట్(హిందీ), **విజయ్** మ్యాడ్ స్క్వేర్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	93,200	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	86,025	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	80
బీరకాయ	40	60	దోసకాయ	25	50
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	60
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	10	20
కాకరకాయ	50	90	గోబిపువ్వు	25	50
వంకాయ	25	50	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	70	120
మెంతికూర	60	90	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	60	గోరుచిక్కుడు	60	80
పుదీనా	40	60	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

ప్రకటన

నగర పద్మశాలి కులబాంధవులకు తెలియజేయునది ఏమనగా నగర పద్మశాలి సంఘం నిజామాబాద్ తర్ఫ అధ్యక్షులు, నగర కార్యవర్గం సర్వసభ్యుల సమావేశంలో మరియు నగర కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించిన విషయం నగర పద్మశాలి తర్ఫ సంఘాలు మరియు సభ్యులు పెరిగిన దృష్ట్యా రాబోయే ఎన్నికలలో 4 పోస్టులు ఉపాధ్యక్షుడు, సహాయ కార్యదర్శి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, ప్రచార కార్యదర్శి అదనముగా పెంచుటకు మరియు కాలపరిమితి 2 సం॥ నుండి 3 సం॥లు పెంచుటకు తీర్మానం చేయనైనది.

ఇట్లు
అధ్యక్షులు, నగర పద్మశాలి సంఘం, రి.నెం. 402/81
శ్రీ భక్త మార్కండేయ దేవాలయం, కోటగల్లి, నిజామాబాద్.